ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రోల్స్-రాయిస్, ఆజాద్ ఇంజినీరింగ్ అధికారులు

ఆజాద్ ఇంజినీరింగ్‌తో రోల్స్-రాయిస్ జట్టు

ఏరో ఇంజిన్ విడిభాగాల తయారీ కోసం..

హైదరాబాద్, జనవరి 29: రాష్ట్రానికి చెందిన రక్షణ విమాన ఇంజిన్ విడిభాగాల తయారీ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్..తాజాగా రోల్స్-రాయిస్‌తో జత కట్టింది. ఇరు సంస్థలు కలిసి రక్షణ ఏరో-ఇంజిన్ విడిభాగాలు హైదరాబాద్‌లో తయారు చేయనున్నది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఈ దీర్ఘకాలిక ఒప్పందంలో భాగంగా హైదరాబాద్ యూనిట్‌లో తయారుకానున్న ఏరో-ఇంజిన్ విడిభాగాలు అంతర్జాతీయంగా సరఫరా చేయనున్నాయి. ఈ సందర్భంగా రోల్స్-రాయిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అలెక్స్ జినో మాట్లాడుతూ.. భారత్‌లో ఇప్పటికే పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని, ముఖ్యంగా డిఫెన్స్ ఏకోసిస్టాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా ఆజాద్ ఇంజినీరింగ్‌తో జత కట్టినట్టు చెప్పారు. కీలకమైన విడిభాగాలను భారత్‌కు తీసుకురావడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నదని ఆజాద్ ఇంజినీరింగ్ సీఈవో రాకేశ్ చోప్‌దార్ అన్నారు.

ఖనిజాల అన్వేషణ కోసం అత్యాధునికంగా రూపొందించిన డ్రోన్‌లతో మారుట్ డ్రోన్ స్టార్టప్ వ్యవస్థాపకులు ప్రేమ్ కుమార్

డ్రోన్లతో ఖనిజాల అన్వేషణ

ఎన్‌ఎండీసీ కోసం 2 డ్రోన్‌లను రూపొందించిన హైదరాబాదీ స్టార్టప్ మారుట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఖనిజాల అన్వేషణ కోసం సంస్థలు నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నాయి. ఇప్పటికే పలు టెక్నాలజీలను వాడుతున్న దేశీయ ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్‌ఎండీసీ తాజాగా అత్యాధునిక డ్రోన్‌లతో అన్వేషణ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే డ్రోన్‌ల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన హైదరాబాదీ స్టార్టప్ మారుట్ డ్రోన్స్‌తో జతకట్టింది. ఖనిజ అన్వేషణ కోసం రెండు డ్రోన్లను తయారు చేయించింది. ఒక్కో డ్రోన్ విలువ రూ.5.50 కోట్లు. ఈ సందర్భంగా మారుట్ డ్రోన్ వ్యవస్థాపకులు, సీఈవో ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ..100 మీటర్ల ఎత్తునుంచి భూమి లోపల కిలోమీటర్ లోతులో ఉన్న పలు రకాల ఖనిజాలను గుర్తించే సామర్థ్యం ఈ డ్రోన్లకు ఉన్నదని తెలిపారు. భూమి మీద ఎలాంటి ప్రాంతాల్లోనైనా ఎగురుతూ లోపల ఉండే ఖనిజాలను గుర్తించనున్నది.

పెరిగిన పసిడి దిగుమతులు

ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో 27 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 29: బంగారం దిగుమతులు మళ్లీ పుంజుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలంలో భారత్ 35.95 బిలియన్ డాలర్ల విలువైన పసిడిని దిగుమతి చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే కాలంలో దిగుమతైన 28.4 బిలియన్ డాలర్లతో పోలిస్తే 26.7 శాతం అధికమని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. దీంతో కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) మరింత పెరిగే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. గత నెలలో పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 156.5 శాతం పెరిగి 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో తొలి తొమ్మిది నెలల్లో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 188.02 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇది 212.34 బిలియన్ డాలర్లుగా ఉన్నది. బంగారం వినిమయంలో చైనా తర్వాత రెండో అతిపెద్ద దేశం భారత్ కావడం విశేషం. దేశీయంగా ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే పసిడి దిగుమతులు భారీగా పుంజుకుంటున్నాయి. గత తొమ్మిది నెలల్లో జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతులు 16.16 శాతం తగ్గి 24.3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

పద్దుపై పరిశ్రమ ఆశలెన్నో..

బడ్జెట్ 2024-25

తయారీ, మౌలికాభివృద్ధికి పెద్దపీట దక్కేనా?

పన్నుల భారాన్నీ తగ్గించాలన్న డిమాండ్లు

న్యూఢిల్లీ, జనవరి 29: రాబోయే మధ్యంతర బడ్జెట్‌లో తయారీ, మౌలికాభివృద్ధి రంగాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని దేశీయ పారిశ్రామిక వర్గాలు కోరుకుంటున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పార్లమెంట్‌లో ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈ క్రమంలోనే కీలక రంగాలకు ఉత్సాహాన్నిచ్చే ప్రకటనల్ని పరిశ్రమ ఆశిస్తున్నది.

ప్రగతిదాయకంగా ఉండాలి

సార్వత్రిక ఎన్నికల ముందు వస్తున్నందున ఈసారి బడ్జెట్‌లో పెద్దగా ఎలాంటి ఆశ్చర్యకర ప్రకటనలు ఉండబోవని ఇప్పటికే మంత్రి నిర్మలా సీతారామన్ సంకేతాలిచ్చారు. అయినప్పటికీ పన్నుల విధానంలో అటు వ్యక్తులకు, ఇటు ఇండస్ట్రీకి మేలు జరిగే మార్పులు రావాలని ఇండస్ట్రీ కోరుకుంటున్నది. ఇక రాబోయే సంవత్సరాల్లో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెట్టేందుకు కావాల్సిన ప్రగతిదాయక నిర్ణయాలుంటాయన్న అంచనాలూ వినిపిస్తున్నాయి. కానీ వీటన్నిటినీ మోదీ సర్కారు ఏమాత్రం నెరవేరుస్తుందోనన్న అనుమానాలూ బలంగానే ఉండటం గమనార్హం. నిజానికి గత బడ్జెట్‌లోనూ పన్నుల భారాన్ని తగ్గించిన దాఖలా లేమీ లేవు. కొత్త ఆదాయ పన్ను విధానాన్ని పరిచయం చేయడంతో.. అందులోనైనా ఈసారి శ్లాబులు/రేట్లను ప్రయోజనకరంగా సవరిస్తారా? లేదా? అన్న సందేహాలు వెంటాడుతున్నాయి.

సీఐఐ, ఫిక్కీ సలహాలివి..

ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక సంఘాలు సీఐఐ, ఫిక్కీ ఈసారి బడ్జెట్ దృష్ట్యా పలు సలహాలు, సూచనలు చేశాయి. ఇందులో 'నేషనల్ మిషన్ ఫర్ అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్' ఏర్పాటును సీఐఐ కోరింది. తయారీ రంగంలో నాణ్యతను, ఉత్పాదకతను పెంచడానికి దీన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్తున్నది. ఈ మిషన్‌తో దేశీయ తయారీ రంగ పరిశ్రమలను సాంకేతికంగా బలపర్చవచ్చంటున్నది. దుస్తులు, ఆటబొమ్మలు, పాదరక్షల వంటి రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపునకూ ఇది దోహదపడుతుందని పేర్కొంటున్నది. క్యాపిటల్ గూడ్స్, కెమికల్స్ తదితర రంగాలు దిగుమతులపై ఆధారపడే పరిస్థితి సైతం తగ్గుతుందని విశ్లేషిస్తున్నది. మరోవైపు వచ్చే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని పెంచాలని ఫిక్కీ కోరుతున్నది. గత బడ్జెట్‌లో 37.4 శాతం పెంచి రూ.10 లక్షల కోట్లకు చేర్చారని గుర్తు చేస్తున్నది.

దిగుమతి సుంకాలపై..

ప్రస్తుతం వైద్య ఉపకరణాల దిగుమతిపై సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నాయని మెడికల్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ పవన్ చౌధరి అన్నారు. అధిక కస్టమ్స్ సుంకాలతో ఆయా పరికరాల విలువ పెరిగిపోతున్నదని, ఇది ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలకు విరుద్ధమని చెప్పుకొన్నారు. వైద్య ఉపకరణాల ధరలు తక్కువగా ఉంటే.. చేసే వైద్య ఖర్చులూ తగ్గుతాయని గుర్తుచేస్తున్నారు.

ఈసారి ఆర్థిక సర్వే లేదు

ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండటంతో ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాల్సి వస్తున్నది. దీంతో ఆర్థిక సర్వే విడుదల కావడం లేదు. ఎన్నికల తర్వాత కొలువుదీరే కొత్త ప్రభుత్వం ఎప్పుడైతే వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రకటిస్తుందో ఆ ముందురోజే ఆర్థిక సర్వే రానున్నది. దీంతో మే, జూన్, జూలై నెలల్లో ఆర్థిక సర్వేకు వీలున్నదంటున్నారు. నిజానికి ఏటా బడ్జెట్‌కు ముందు రోజే ఆర్థిక సర్వే విడుదలవుతుంది. కానీ ఎన్నికల ఏడాది మాత్రం తాత్కాలిక బడ్జెట్‌లే ఉంటాయి. కాబట్టే ఆర్థిక సర్వేలు రావు. ఇక 2018 నుంచి ఫిబ్రవరి 1నే కేంద్ర బడ్జెట్ ఉంటున్నది. దీంతో జనవరి 31న ఆర్థిక సర్వే వస్తున్నది. అంతకుముందు మార్చి నెలలో బడ్జెట్ ఉండేది. ఆ ముందురోజు ఆర్థిక సర్వే వచ్చేది. కాగా, ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కనుసన్నల్లో ఆర్థిక వ్యవహారాల శాఖలోని ఆర్థిక విభాగం ఈ ప్రతిష్ఠాత్మక నివేదికను ఏటా సిద్ధం చేస్తుంది. ప్రస్తుతం సీఈఏగా వీ అనంత నాగేశ్వరన్ ఉన్నారు. మరోవైపు సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ది ఇండియన్ ఎకానమీ: ఏ రివ్యూ' పేరుతో ఓ రిపోర్టును తెచ్చింది. పెట్టుబడులు, హౌజింగ్, మహిళలు, స్థూల ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం, రుణ భారం తీరుతెన్నులను వివరించారు.

ఎంఎన్‌సీల మనుగడపై ఉత్కంఠ!

- బహుళ జాతి సంస్థలతో ఉపయోగం లేదన్న డిప్యూటీ సీఎం
- వాటిపైనే ఆధారపడుతున్న వేలాది ఎంఎస్ఎంఈలు

హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే ఏర్పాటైన బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సీ), వాటికి అనుబంధంగా కొనసాగుతున్న అనేక సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) భవిత వ్యంపై ఉత్కంఠ నెలకొన్నది. ఎంఎన్‌సీల వల్ల భూతద్దం పెట్టి వెదికినా ఎటువంటి ఉపయోగం కనిపించడంలేదని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించడమే ఇందుకు కారణం. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడ తామంటున్న నూతన పారిశ్రామిక విధానంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. రాష్ట్రంలో ప్రస్తుతం అనేక ప్రభుత్వరంగ సంస్థలు, ఎంఎన్‌సీలకు అనుబంధంగా వేల సంఖ్యలో ఎంఎస్ఎంఈలు మనుగడ సాగిస్తున్నాయి. తెలంగాణలో వివిధ రంగాల్లో వందల సంఖ్యలో ఎంఎన్‌సీలు, వాటికి అనుబంధంగా వేల సంఖ్యలో ఎంఎస్ఎంఈలు కొనసాగుతున్నాయి. గత పదేండ్ల కేసీఆర్ పాలనలో వందల సంఖ్యలో ఎంఎన్‌సీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. చర్లపల్లి, బాలానగర్, జీడిమెట్ల, కాటేదాన్, నాచారం, ఉప్పల్ తదితర ప్రాంతాల్లోని చాలావరకు ఎంఎస్ఎంఈలు ఆయా ఎంఎన్‌సీలకు అనుబంధంగా కొనసాగుతున్నవే.

నూతన పారిశ్రామికంపై సర్వత్రా ఆసక్తి

ఈ నేపథ్యంలో ఎంఎన్‌సీల వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, తాము ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు త్వరలో ఒక నూతన విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గత కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన టీఎస్ఐపాస్ విధానం దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అత్యుత్తమమైన విధానంగా పేరుగాంచింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న విధానం ఇంతకన్నా మెరుగ్గా ఉంటుందా? ఒకవేళ ఉంటే అందులో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ప్రయోజనాలు కల్పించనున్నారు? అనే అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఎంఎన్‌సీల పట్ల రాష్ట్ర వైఖరి ఎలా ఉంటుందనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది.

ఎంఎన్‌సీల భవితవ్యంపై ఉత్కంఠ

ఎంఎస్ఎంఈలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పున్నది. వాస్తవానికి ఉపాధి అవకాశాల కల్పనలో ఎంఎస్ఎంఈలదే పైచేయి అనడంలో సందేహం లేదు. అయితే, చాలావరకు ఎంఎస్ఎంఈలు ఎంఎన్‌సీలపైనే ఆధారపడుతున్నాయి. ప్రభుత్వ వైఖరి, పారిశ్రామిక విధానాలు, ముఖ్యంగా పాలకులపై విశ్వాసం కలిగితేనే కొత్త పెట్టుబడులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన పారిశ్రామిక అనుకూల విధానాలతో తెలంగాణపట్ల పరిశ్రమ వర్గాల్లో సానుకూల దృక్పథం ఏర్పడింది. దీంతో చాలా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచాయి.

ఒలెక్ట్రా లాభం 27 కోట్లు

హైదరాబాద్, జనవరి 29: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.27.11 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.15.30 కోట్లతో పోలిస్తే 77 శాతం వృద్ధిని సాధించినట్లు పేర్కొంది. ఈవీ బస్సులను అధికంగా డెలివరీ చేయడంతో సంస్థకు గత త్రైమాసికంలో రూ.342.14 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికం చివరినాటికి 1,615 యూనిట్ల ఈవీలను డెలివరీ చేయడం జరిగిందని, అయినప్పటికీ ఇంకా 8,088 యూనిట్ల ఆర్డర్లు చేతిలో ఉన్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ కేవీ ప్రదీప్ తెలిపారు. మరోవైపు, రంగారెడ్డి జిల్లాలోని సీతారాంపూర్ వద్ద 150 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న యూనిట్‌లో వచ్చే నెలలో ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు.

సామ్‌సంగ్ ల్యాప్‌టాప్‌ల తయారీ ఇక్కడే

గురుగ్రామ్, జనవరి 29: కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ పరికరాల దిగ్గజం సామ్‌సంగ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది నుంచి నోయిడా ఫ్యాక్టరీలోనే ల్యాప్‌టాప్‌లను ఉత్పత్తి చేయబోతున్నట్లు ప్రకటించింది. దీంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అవసరం లేదని, ఇక్కడే తయారుకానుండటంతో ధరలు తగ్గే అవకాశం కూడా ఉంటుందని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రెసిడెంట్ టీఎం రోహ్ తెలిపారు. ఇందుకు సంబంధించి పనులు పురోగతిలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వాల సహాయ సహకారాలు ఉండటంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నట్లు, దీంట్లోభాగంగానే ల్యాప్‌టాప్‌లను ఇక్కడ తయారు చేస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ.. పెట్టుబడులకు అనువైనది

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉన్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రైతులకు ప్రయోజనం కలిగే విధంగా విధానాలను రూపొందిస్తున్నట్లు, దళారి వ్యవస్థ లేకుండా నేరుగా రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో వీ-హబ్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, బెంగళూరు కాన్సులేట్ జనరల్ హిలరి మెక్‌గెచ్చితో శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీ-హబ్‌తో ఆస్ట్రేలియా ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఆయా కోర్సుల్లో శిక్షణ అందించడానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగం, దాని ఆధారిత రంగాలను మరింత లాభసాటిగా మార్చేందుకు యూనివర్సిటీలు, నిపుణులు, పరిశోధకులు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మహిళా సాధికారత పునాదులపై తెలంగాణ వృద్ధి ఆధారపడి ఉంటుందని తాము విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు బాగున్నాయని, ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నది మంచి ఆలోచన అని కితాబిచ్చారు.

బెనిఫిషియరీ వివరాల్లేకుండానే ఐఎంపీఎస్ ద్వారా రూ.5 లక్షలదాకా బదిలీ

- ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, జనవరి 29: బెనిఫిషియరీ పేరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో సంబంధం లేకుండానే బ్యాంక్ ఖాతాల మధ్య ఇమ్మీడియెట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ద్వారా రూ.5 లక్షలదాకా బదిలీ చేసుకోవచ్చు. వచ్చే నెల 1 నుంచి ఈ అవకాశం ఖాతాదారులకు అందుబాటులోకి రానున్నది. ఈ మేరకు గతేడాది అక్టోబర్ 31నే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఓ సర్క్యులర్‌ను విడుదల చేసింది. దీంతో ఫిబ్రవరి 1 నుంచి మనం ఎవరికైతే నగదును పంపుతున్నామో వారి బ్యాంక్ ఖాతా నంబర్, ఖాతాదారుని పేరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లను జత చేయాల్సిన అవసరం లేకుండా పోతున్నది. మొబైల్ నంబర్, బ్యాంక్ పేరుంటే చాలు. ప్రస్తుతం మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లో పూర్తిగా అన్ని వివరాలను పేర్కొనాల్సి వస్తున్నది. కాగా, ఐఎంపీఎస్ అనేది ఓ నిరంతర నగదు బదిలీ వ్యవస్థ. దేశీయ డిజిటల్ లావాదేవీల్లో దీనికి ప్రాధాన్యత ఉన్నది తెలిసిందే.

ఐఎంపీఎస్ విధానమిది..

- బ్యాంకింగ్ యాప్ ఓపెన్ చేయాలి.
- 'ఫండ్ ట్రాన్స్‌ఫర్'ను ఎంచుకోవాలి.
- ఐఎంపీఎస్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
- ఎవరికైతే పంపుతున్నామో వారి మొబైల్ నంబర్, వారికి ఖాతా ఉన్న బ్యాంక్ పేరును పేర్కొనాలి.
- పంపే నగదు మొత్తాన్ని ఎంటర్ చేయాలి.
- అన్నీ సరిచూసుకున్న తర్వాత 'కన్ఫమ్'పై క్లిక్ చేయాలి.
- మీకు అందే వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)తో లావాదేవీని పూర్తి చేసుకోవచ్చు.

బడ్జెట్ వారంలో బడా ర్యాలీ

సెన్సెక్స్ 1,241 పాయింట్లు జంప్ • 385 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

ముంబై, జనవరి 29: వరుసగా రెండు వారాలు పతనాన్ని చవిచూసిన స్టాక్ మార్కెట్ సోమవారం ఒక్కసారిగా దూకుడు ప్రదర్శించింది. ఫిబ్రవరి 1న లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో హఠాత్తుగా కొనుగోళ్లు వెల్లువెత్తడంతో బీఎస్ఈ సెన్సెక్స్ 1,241 పాయింట్లు పెరిగి 71,941 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 385 పాయింట్లు లాభపడి 21,738 పాయింట్ల వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్లలో సానుకూల ట్రెండ్, మధ్యంతర బడ్జెట్‌పై అంచనాలతో దేశీయ ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లు జరిపారని విశ్లేషకులు తెలిపారు. యూఎస్ సూచీలు ఏ రోజుకారోజు కొత్త రికార్డుస్థాయిల్ని చేరుతున్న ప్రభావం భారత్‌పై కూడా పడిందని వారన్నారు. ఆసియాలో సియోల్, టోక్యో, హాంకాంగ్ ఇండెక్స్‌లు లాభపడగా, యూరప్ స్టాక్స్ మిశ్రమంగా ముగిసాయి. సోమవారం దేశీయ ఫండ్స్ రూ. 3,220 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేయగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.110 కోట్ల స్వల్ప పెట్టుబడి చేశారు.

మధ్యంతర బడ్జెట్‌పై ఆశలు

ఇటీవలి క్షీణతతో తక్కువ ధరలో లభిస్తున్న క్వాలిటీ షేర్ల కొనుగోళ్లు జరిగాయని, మధ్యంతర బడ్జెట్‌పై ఆశావహ అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపర్చినట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. గతవారం భారీ విక్రయాల అనంతరం సోమవారం సానుకూల అంతర్జాతీయ ట్రెండ్‌కు తోడు పెద్ద ఎత్తున షార్ట్ కవరింగ్ జరగడంతో మార్కెట్ ర్యాలీ చేసిందని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సి చెప్పారు.

ఫెడ్ పాలసీ కీలకం

దేశీయ మార్కెట్‌ను ప్రభావితం చేసే అంతర్జాతీయ ట్రెండ్‌కు రానున్న యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ కీలకమైనదని వినోద్ నాయర్ తెలిపారు. ఈ నెల 31న ఫెడ్ పాలసీ ప్రకటన వెలువడనున్నది. ఇప్పుడు రేట్ల కోత ఉండదుగానీ, తదుపరి నెలల్లో ఫెడ్ ఎలా వ్యవహరిస్తుందన్న సంకేతాలు ట్రెండ్‌ను నిర్దేశిస్తాయన్నారు. అమెరికాలో పటిష్ఠ ఆర్థిక గణాంకాలు వెలువడుతున్నందున, ఈ ఏడాది మార్చిలో వడ్డీ రేట్ల కోతపై మార్కెట్లు అంచనాల్ని తగ్గించుకుంటున్నప్పటికీ, ఈ ఏడాది ఎన్ని దఫాలు రేట్లను తగ్గించవచ్చన్న ఫెడ్ సంకేతాల కోసం ఇన్వెస్టర్లు ఆతృతతో ఎదురు చూస్తున్నారని నాయర్ వివరించారు. మధ్యంతర బడ్జెట్, ఫెడ్ పాలసీల సందర్భంగా మార్కెట్ కొంతమేర హెచ్చుతగ్గులకు లోనుకావచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖెమ్కా చెప్పారు.

హెవీ 'వెయిట్' లిఫ్టింగ్

ప్రధాన హెవీవెయిట్ షేర్లు తాజా ర్యాలీలో కదంతొక్కాయి. సెన్సెక్స్‌లో 12 శాతం వరకూ వెయిటేజీ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ 7 శాతం లాభపడి దాదాపు 498 సెన్సెక్స్ పాయింట్లను జతచేసింది. మరో హెవీవెయిట్ లార్సన్ అండ్ టూబ్రో 3.25 శాతం ఎగిసి 106 సెన్సెక్స్ పాయింట్లను పెంచింది. ఈ రెండు షేర్లూ ఆల్ టైమ్ రికార్డుస్థాయి వద్ద ముగియడం గమనార్హం. మిగిలిన సెన్సెక్స్ షేర్లలో టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ, టైటాన్, అల్ట్రాటెక్ సిమెంట్‌లు 2-3.5 శాతం మధ్య లాభపడ్డాయి. మరోవైపు ఐటీసీ, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, టాటా కన్సల్టెన్సీ సర్వీస్‌లు స్వల్ప నష్టాలతో ముగిసాయి. తాజా ర్యాలీలో హెవీవెయిట్ షేర్లతో పోలిస్తే చిన్న షేర్లు తక్కువ గానే పెరిగాయి. సెన్సెక్స్ 1.76 శాతం లాభపడగా, బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.68 శాతం, స్మాల్ క్యాప్ సూచి 1.03 శాతం చొప్పున పెరిగాయి. వివిధ రంగాల సూచీల్లో అధికంగా ఎనర్జీ ఇండెక్స్ 5.29 శాతం జంప్ చేసింది. ఆయిల్ అండ్ గ్యాస్ 4.94 శాతం, పవర్ 3.03 శాతం, సర్వీసుల సూచి 2.82 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.13 శాతం, కన్జూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 1.93 శాతం చొప్పున ర్యాలీ జరిపాయి. మరోవైపు ఎఫ్ఎంసీజీ, ఐటీ, టెక్నాలజీ ఇండెక్స్‌లు తగ్గాయి.

పాజిటివ్ ట్రెండ్

కొద్దిరోజులపాటు తీవ్ర ఒడిదుడుకులకు లోనైన నిఫ్టీ తాజా ర్యాలీలో కీలకమైన 20 రోజుల మూవింగ్ ఏవరేజ్‌ను (20 డీఎంఏ) తిరిగి అందుకున్నందున స్వల్పకాలికంగా ట్రెండ్ పాజిటివ్‌గా ఉంటుందని ఎలిక్‌పీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే చెప్పారు. వచ్చే కొద్ది రోజుల్లో 22,100-22,150 శ్రేణి వరకూ పెరిగే అవకాశం ఉందని, లాభాల స్వీకరణ ఎదురైతే 21,550 పాయింట్ల స్థాయి తక్షణ మద్దతు అందించవచ్చని అంచనా వేశారు.

6 లక్షల కోట్లు పెరిగిన సంపద

సోమవారంనాటి ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద ఒక్కసారిగా రూ.6 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ 6,08,556 కోట్లు పెరిగి రూ.3,77,20,679 లక్షల కోట్లకు (4.53 ట్రిలియన్ డాలర్లు) చేరింది.



రిలయన్స్ విలువ రూ.19.59 లక్షల కోట్లు

మూడేండ్ల తర్వాత అతిపెద్ద ర్యాలీ జరిపిన ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ 19.59 లక్షల కోట్ల రికార్డుస్థాయిని తాకింది. సోమవారం ఇంట్రాడేలో ఈ షేరు బీఎస్ఈలో దాదాపు 7.34 శాతం పెరిగి రూ.2,9,05 వద్దకు చేరిన సమయంలో ఆర్ఐఎల్ విలువ రూ.19,59,444 కోట్లకు చేరింది..చివరకు ఈ షేరు 6.86 శాతం లాభంతో చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి రూ.2,896 వద్ద నిలిచింది. ఆర్ఐఎల్ షేరు పెరగడం ఇది వరుసగా మూడో రోజు. ఈ మూడు రోజుల్లో రూ.1,25,591 కోట్ల మార్కెట్ విల